క్లుప్తంగా

కంటి వైద్యశిబిరం



కళ్లజోడు అందజేస్తున్న ట్రస్ట్ ఛైర్మన్ భిక్షపతియాదవ్ తదితరులు

శేరిలింగంపల్లి: ఎంఎస్ఎమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి గోపీనగర్‌లో సోమవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతియాదవ్, సెక్రటరీ ఎం.రవికుమార్‌యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదానం, విద్యాదానం, అన్నదానం, రక్తదానం చేయాలన్నారు. అవసరమైన వారికి కళ్ళద్దాలు అందజేశారు.కార్యక్రమంలో ఎల్లేష్, చంద్రమోహన్, సూరి, ప్రసాద్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఝాన్సీ, నరసింహ, వినయ్, అశోక్, హరీష్ పాల్గొన్నారు.

నిమజ్జన కోనేర్లు పరిశీలన



మల్కంచెరువు వద్ద ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మహేష్ తదితరులు

రాయదుర్గం: వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని గణేష్ నిమజ్జన కోనేర్లను పోలీసు అధికారులు సోమవారం పరిశీలించారు. అందులో భాగంగా గచ్చిబౌలి డివిజన్‌లోని రాయదుర్గం మల్కంచెరువు వద్ద ఏర్పాటు చేసిన నిమజ్జన కోనేరును మాదాపూర్ ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ మహేష్ ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది పరిశీలించారు. ఈ కోనేరుకు వచ్చే విగ్రహాల సంఖ్య, చేపట్టాల్సిన భద్రతా చర్యలపై చర్చించారు.

22 మందికి జరిమానా

పటాన్‌చెరు టౌన్: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించింది. పటాన్‌చెరు ట్రాఫిక్ సీఐ ప్రవీణ్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శని, ఆదివారాల్లో నిర్వహించిన డ్రంకెన్ అండ్ డ్రైవ్ లో 22 మందిని పట్టుకున్నట్లు చెప్పారు.పట్టుబడిన వాహనదారులను సోమవారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా జడ్జి 19 మందికి ఒక్కొక్కరికీ రూ.2 వేల చొప్పున, మరో వ్యక్తి కి రూ.3 వేలు, మరో ఇద్దరికి రూ.5 వేలు జరిమాన విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య చికిత్స నిమిత్తం మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ 11 లక్షల 62 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని సోమవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా క్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, రాజు నాయక్, కొండా విజయ్, తిరుపతిరెడ్డి, ప్రసాద్, జనార్దన్, బాబు మోహన్, మల్లేష్, శ్రావణిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వరద నీటి కాలువ పనుల పరిశీలన

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని జలవాయువిహార్ కాలనీలో చేపడుతున్న స్టామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను సోమవారం స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు స్థానికులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ మహదేవ్, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతుల రాజేందర్, కాలనీవాసులు వివేక్, యుఆర్‌కె ప్రసాద్, విఠల్, పీవీ రావు, వర్మ, శ్రీనివాస్, కృష్ణన్, మునికృష్ణ పాల్గొన్నారు.

బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి గాయాలు

పటాన్‌చెరు టౌన్: టీవీఎస్ ఎక్సెల్‌ను బైక్ ఢీకొట్టిన ఘటనలో భార్యభర్తలకు గాయాలైన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం ఎస్ఎన్ కాలనీకి చెందిన సాయిలు, పద్మ ఇద్దరు కలిసి ఆదివారం సాయంత్రం బీరంగూడ గుట్టపైకి టీవీఎస్ ఎక్సెల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న స్ప్లెండర్ బైక్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన సాయిలు, పద్మను చికిత్స కోసం బీరంగూడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. వారి కుమారుడు ప్రవీణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓటరు జాబితా..కసరత్తు



ప్రత్యేక శిబిరం వద్ద వివరాలు తెలుసుకుంటున్న అధికారులు (ఫైల్)

- ప్రత్యేక శిబిరాల ద్వారా భారీగా దరఖాస్తులు
- ఓటరు నమోదుకు 19 వరకు అవకాశం
- అక్టోబర్ 4న తుది జాబితా

పటాన్‌చెరు టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ జాబితా సవరణకు కసరత్తు కొనసాగుతుంది.18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటు హక్కు కల్పించడంతో పాటు మార్పులు, చేర్పులు చేసేందుకు పటాన్‌చెరు నియోజకవర్గ పోలింగ్ కేంద్రాల్లో ఆగస్టు 26, 27, సెప్టెంబర్ 2,3 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించారు. బీఎల్వోలు వారికి కేటాయించిన కేంద్రాల్లో దరఖాస్తులను స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు.

18 ఏళ్లు నిండిన వారు అర్హులు

2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవచ్చు. ఇందుకు ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చని అధికారులు విస్తృత ప్రచారం కల్పిస్తున్నారు.

దరఖాస్తుల వెల్లువ

నియోజకవర్గంలో 391 పోలింగ్ స్టేషన్‌లకు గాను ఆగస్టు 26, 27 తేదీల్లో రెండు రోజులు నిర్వహించిన ప్రత్యేక శిబిరాల్లో ఓటు నమోదు ఫారం-6 కు 2,773 దరఖాస్తులు వచ్చాయి, ఓటు తొలగింపు ఫారం-7 కు నాలుగు దరఖాస్తులు, ఓటరు కార్డుల సవరణలు ఫారం-8 కు 325 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అదేవిధంగా సెప్టెంబర్ 2,3 తేదీల్లో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో ఫారం-6 కొత్త ఓటర్ కార్డులకు 7,901 దరఖాస్తులు ,ఫారం-7 మూడు దరఖాస్తులు రాగా,ఫారం-8 కు 1,459 దరఖాస్తులు వచ్చాయి, వచ్చిన దరఖాస్తులను ఎన్నికల అధికారులు పరిశీలించారు.

అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా...

ఓటు నమోదు, తొలగింపు, సవరణకు ప్రత్యేక శిబిరాలు ముగిసినప్పటికీ దరఖాస్తులను ఈనెల 19 వరకు స్వీకరించడానికి ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది. గత నెల 21న విడుదలైన ఓటర్ ముసాయిదా జాబితా పై అభ్యంతరాలను సైతం ఈనెల 19 వరకు స్వీకరించనున్నారు. ఈ అభ్యంతరాలతో పాటు ఓటు నమోదు తొలగింపు సవరణ కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ వచ్చిన దరఖాస్తులు సైతం బిఎల్‌ఓ లు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి ఈనెల 28 వరకు వాటిని పరిష్కరించనున్నారు. అనంతరం అక్టోబర్ 4న ఓటరు తుది జాబితా విడుదల కానుంది. బిఎల్వోలు క్షేత్రస్థాయిలో పారదర్శకంగా విధులు నిర్వహించేలా పర్యవేక్షించేందుకు ప్రతి పోలింగ్ కేంద్రాలకు ఒక సూపర్ వేజర్ లను నియమించారు.అదేవిధంగా దరఖాస్తులను ఎప్పటికప్పుడు యాప్ లో నమోదు చేయాలని అధికారులు చెబుతున్నారు.

ఓటరుగా నమోదు చేసుకోవాలి..



18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు ఓటర్‌గా నమోదు చేసుకోవాలి.ప్రత్యేక శిబిరాలు ముగిసినప్పటికీ దరఖాస్తు స్వీకరణకు ఈనెల 19 వరకు ఎన్నికల సంఘం అవకాశం ఇచ్చింది.అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు.

– ఓటర్ నమోదు అధికారి (ఈఆర్‌ఓ) దేవుజ

ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం



కలామ్ అవార్డు స్వీకరించిన ప్రొ.కిషోర్



ఐఎన్ఏఈ ఫెలోగా ప్రొ.మాధవకృష్ణ

- ఒకరికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్‌పీసీ అవార్డు-2023
- మరొకరు ఐఎన్ఏఈ ఫెలోగా ఎంపిక

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం లభించింది. ప్రొఫెసర్ మాధవకృష్ణ ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్(ఐఎన్ఏఈ) ఫెలోగా ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ రంగంలో ముఖ్యంగా టెక్నాలజీలో వస్తున్న మార్పులపై ఆయనకున్న అవగాహన, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ మాధవ కృష్ణను ఎంపిక చేశారు.

ప్రొఫెసర్ కిషోర్‌కు డా.కలామ్ అవార్డు

ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ కిషోర్ కొత్తపల్లికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్‌పీసీ అవార్డు-2023కి ఎంపికయ్యారు.ముఖ్యంగా అల్గోరిథమ్ ఇంజనీరింగ్ టెక్నిక్స్ రంగంలో ఆయనకున్న ప్రతిభ, అనుభవాన్ని గుర్తించి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. వీరిని పలువురు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.

మట్టి వినాయకుల పంపిణీ



కార్యక్రమంలో ఎమ్మెల్యే గాంధీ, కొండావిజయ్

గచ్చిబౌలి: మట్టి వినాయకులను పూజిద్దాం....పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఎమ్మెల్యే గాంధీ పిలుపునిచ్చారు. హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్ కుమార్ ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీని సోమవారం ఆయన ప్రారంభించారు. కొండా విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత 8 ఏళ్ళుగా మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 5వేల మట్టి వినాయకులను పంపిణీ చేయాలని ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, హోప్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ధర్నా



శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

శేరిలింగంపల్లి: అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శేరిలింగంపల్లి తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ శేరిలింగంపల్లి మండల కార్యదర్శి కొంగరి కృష్ణ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 70 వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారంతా బడుగు, బలహీన వర్గాలకు చెందిన మహిళలే నన్నారు. కనీస వేతనాలు, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత లేక అంగన్‌వాడీలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులను పర్మినెంట్ చేయడంతో పాటు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కమిటీ ప్రతినిధులు కె.జ్యోతి, సరస్వతి, నాగమణి, సుజాత, సంధ్యారాణి, సువర్ణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మియాపూర్: నేడు విద్యుత్ మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ హరిసింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు న్యూ కాలనీ, లక్ష్మీనగర్, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ స్ట్రీట్, డోవా కాలనీ, ఎస్ఎంఆర్ వినయ్ సిటీ, రత్నదీప్ సూపర్ మార్కెట్, నరేన్ గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని తెలిపారు.

ఎమ్మెల్యేకు సన్మానం

గచ్చిబౌలి: అర్హులైన ప్రతి ఒక్కరికీ దశలవారిగా డబుల్ ఇళ్లను కేటాయిస్తామని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల పంపిణీలో భాగంగా మొదటివిడత డ్రాలో చందానగర్ డివిజన్ పరిధిలో పీఏనగర్‌కి చెందిన లీలకు ఇల్లు వచ్చిన సందర్భంగా సోమవారం ఎమ్మెల్యేను వారు సన్మానించారు.

27 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ముగ్గురు అరెస్ట్

గచ్చిబౌలి: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాయదుర్గం పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం .. చాదర్‌ఘాట్‌లో రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలించేందుకు పంపిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు నానక్‌రాంగూడ వద్ద లారీని ఆపి తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అందులోని 27 టన్నుల బియ్యం, డ్రైవర్ సయ్యద్ సజ్జాద్(32) క్లీనర్ మహ్మద్ నౌమాన్, పైలట్ నహీమ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ రాష్ట్రాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అధికారులు, రిసోర్స్‌పర్సన్లు

రాయదుర్గం: విలువలతో కూడిన విద్యా బోధన అవసరాన్ని అధ్యాపకులంతా గుర్తించాలని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి నారాయణ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ-హెచ్‌ఆర్‌డీసీలో వారం రోజుల పాటు నిర్వహించిన స్వల్పకాలిక కోర్సు శిక్షణా కార్యక్రమం ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులలో లింగ సున్నితత్వాన్ని పెంపొందించడానికి , లింగ హింసపై విమర్శనాత్మకంగా ప్రతిబింబించే ఈ కార్యక్రమం యూజీసీ తీసుకున్న చొరవలోఒక భాగమన్నారు. కార్యక్రమంలో ×మనూ× యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా, హెచ్‌సీయూ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన రిసోర్స్‌పర్సన్లు తమ అభిప్రాయాలను వివరించారు. శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

చదువుతోపాటు నైపుణ్యం తప్పనిసరి

రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆర్గానిక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఏ రషీద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో పీజీడీఎం 2023-25 బ్యాచ్ విద్యార్థులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రషీద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. చదువుతోపాటు 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై ప్రతి విద్యార్థి దృష్టి పెట్టాలన్నారు. ఐటీసీ జీఎం(రిటైర్డ్) కేజేఏ స్వరూప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాము చదివే అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీకి నాలుగు స్థంభాలైన శిక్షణ, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎస్‌పీజీఎస్ అంశాలపై వివరించారు. కార్యక్రమంలో ఎస్‌పీజీఎస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఏ జగన్‌మోహన్‌రెడ్డి, ఏఅండ్‌పీ చీఫ్ ఎస్ లక్ష్మీకాంతరావు, స్టూడెంట్స్ ఫ్యాకల్టీ కోఆర్డినేటర్ డాక్టర్ ఎం సింధూ, సీనియర్ అధికారులు కెఎన్‌రావు, చాయాపద్మ, పీజీడీఎం విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించిన డైరెక్టర్ రామేశ్వరరావు, ఇతర అధికారులు

దీప్తిశ్రీనగర్‌లో గడపగడపకూ బీజేపీ

మియాపూర్: ప్రతి అడుగు రేపటి మార్పుకోసమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా రవికుమార్ చేపట్టిన ప్రజా యాత్ర 90వ రోజుకు చేరుకుంది. చందానగర్ డివిజన్ దీప్తీశ్రీనగర్‌లో రవికుమార్ యాదవ్, కన్వీనర్ రాఘవేంద్రరావు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ సింధురెడ్డి, నాగుల్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీబీరావు, కనకదుర్గ, సూర్యనారాయణ, సుధాకర్, రమణకుమారి, అనిల్‌కుమార్, అజయ్‌యాదవ్, మహమ్మద్‌గౌస్, అర్జున్ తదితరులున్నారు.

విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు



రామాలయ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో సోమవారం ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయిలో గురుపూజోత్సవ వేడుకలకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ విద్యారంగానికి అత్యధిక నిధులు కేటాయించారని తెలిపారు. మన ఊరు- మనబడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల పరిధిలో విధులు నిర్వహిస్తున్న 75 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రభాకర్, ఎంపీపీలు సుష్మ శ్రీ, ప్రవీణ ,జెడ్పీటీసీలు సుప్రజా,సుధాకర్‌రెడ్డి, కుమార్‌గౌడ్, కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, వివిధ శాఖల అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గూడెం మధుసూదన్‌రెడ్డి, అఫ్జల్, గోవింద్ పాల్గొన్నారు.

శంకుస్థాపన

పటాన్‌చెరు: కులమతాలకు అతీతంగా నియోజకవర్గంలో సర్వమత సామరస్యాన్ని పెంపొందిస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనోలు గ్రామంలో నూతనంగా నిర్మించనున్న రామాలయం నిర్మాణ పనులకు ఎమ్మెల్యే సోమవారం శంకుస్థాపన చేశారు. దేవాలయం అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ,జెడ్పీటీసీ సుప్రజా,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్ కుమార్, సర్పంచ్ పద్మ వెంకటేష్ మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి, గ్రామ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

క్రీడలకూ ప్రాధాన్యమివ్వాలి

- భారత మాజీ క్రికెటర్ అంబటిరాయుడు
- హెచ్ఐసీసీలో హైబిజ్ టీవీ ఎడ్యుకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్- 2023 ప్రదానం



సైయింట్ ఫౌండేషన్ డైరెక్టర్ మోహన్‌రెడ్డికి లెజెండ్ అవార్డ్‌ను అందజేసిన అతిథులు

మాదాపూర్: విద్యాసంస్థలు విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని భారత మాజీ క్రికెటర్ అంబటిరాయుడు పేర్కొన్నాడు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో సోమవారం హైబిజ్ టీవీ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డ్స్- 2023 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రికెట్ క్రీడాకారుడు అంబటి రాయుడు, భారత టేబుల్ టెన్నిస్ ప్లేయర్ నైనా జైస్వాల్‌లు పాల్గొని విద్యారంగానికి చెందిన 50 సంస్థలకు అవార్డులను అందజేశారు. విద్యారంగంలో సేవలను అందించిన ముగ్గురు దిగ్గజాలకు లెజెండ్స్ అవార్డులను అందజేశారు. వీటిలో హిందీ మహా విద్యాలయ అధ్యక్షుడు సీఏ లక్ష్మీవాస్ శర్మ, సైంట్ ఫౌండేషన్ డైరెక్టర్ డాక్టర్ బీవీఆర్ మోహన్‌రెడ్డి, టైమ్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ మానెక్ ఎస్.దారువాలాకు అందజేశారు. కార్యక్రమంలో హైబిజ్ టీవి ఎండి రాజగోపాల్ ,క్రెడాయి హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి రాజశేఖర్‌రెడ్డి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ పి.కృష్ణన్, ఆదిత్య మ్యూజిక్ ఓనర్ దినేష్ గుప్తా, ఏపీ, తెలంగాణ ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన ఇండోనేషియా బృందం



ఇండోనేషియా బృందానికి జ్ఞాపికను అందిస్తున్న వీసీ ప్రొఫెసర్ బీజేరావు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఇండోనేషియా బోగోర్‌లోని ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం సోమవారం సందర్శించింది. ఇండోనేషియాలోని బోగోర్‌లోని ఐపీబీ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ వైస్ రెక్టార్ ప్రొఫెసర్ ఎర్నాన్ రస్టియాడి, ప్లాంట్ ఎకాలజిస్ట్, సైకాలజిస్ట్ ప్రొఫెసర్ ఎ డిసంతోషా, ఐకార్-క్రైడా లైజాన్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కె ఆలమ్‌తో కూడిన బృందం వీసీ బీజేరావుతో సమావేశమయ్యారు. ముఖ్యంగా రెండు సంస్థల మధ్య సహకారంపై చర్చించారు. వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ సంస్కృతి వారసత్వం, చరిత్రకు సంబంధించి దేశాల మధ్య ఉన్న సారుప్యతలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోజనం చేకూర్చే విధంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం మాట్లాడుతూ ఇండోనేషియాలో ఐపీబీ విశ్వవిద్యాలయం అతిపెద్ద మొదటి వ్యవసాయ విశ్వవిద్యాలయమని పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్, ప్లాంట్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొ.రాజగోపాల్, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ సామ్రాట్ ఎల్ సబత్, ఓఐఏ అసోసియేట్ డైరెక్టర్, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ అలోక్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఇన్సిడెంట్ ఫ్రీగా చవితి వేడుకలు చేసుకోవాలి
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర



రాయదుర్గం: గణేష్ వేడుకల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన అంశాలపై గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, జీహెచ్ఎంసీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, అగ్నిమాపక శాఖ, నీటిపారుదల, రోడ్లు, భవనాలు, మెడికల్ అండ్ హెల్త్ శాఖ, రెవిన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పరిపాలనా విభాగం శాఖ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి(బీజీయూఎస్) ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు కొనసాగే గణేష్ చతుర్థికి ఈ ఏడాది 1200 విగ్రహాల ప్రతిష్ట ఉండొచ్చని అన్నారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామన్నారు. కార్యక్రమంలో సైబరాబాద్ అదనపు సీపీ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీలు, ఏడీసీలు, బీజీయూఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, నర్సింగ్ పూరి, అధికారులు పాల్గొన్నారు.

మార్పు కోసం బీజేపీ పాదయాత్ర

ఆల్విన్‌కాలనీ: మార్పు కోసం బీజేపీ పాదయాత్ర సోమవారం ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ చౌరస్తా నుంచి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు నేతృత్వంలో డివిజన్ అధ్యక్షుడు కమలాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా రవీందర్‌రావు, మహిళా మోర్చ జిల్లా ఉపాధ్యక్షురాలు స్రవంతి, రవీందర్ రావులు మాట్లాడుతూ మార్పు కోసం బీజేపీ అనే నినాదం ద్వారా ప్రజల మధ్యకు వెళ్లి ప్రజా సమస్యలను తెలుసుకుంటున్నామన్నారు.

రోడ్లపై రూ.500 నోట్లు..

రాయదుర్గం: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ పోలీసులు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా వినూత్న ప్రచారాన్ని ప్రారంభించారు. పలుచోట్ల రూ.500 నోటుతో కూడిన పర్సులను రోడ్లపై ఉంచారు. నడిచివెళ్లేవారు చేతిలోని బ్యాగు, ఇతర వాటిని పక్కన పెట్టి దాన్ని తీసుకునే సమయంలో వాటిని కొట్టేసేలా దొంగలు యత్నం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ఈ క్రమంలో సైబరాబాద్ పరిధిలో రద్దీ ప్రాంతాలలో రూ.500 నోట్లు ఉన్న పర్సును రోడ్డుపై ఉంచుతున్నారు. ప్రజలు పర్సు అనుకుని తెరిచి చూస్తే సైబర్ నేరాలపై 1930కు కాల్ చేయాలని సమాచారం ఉంచారు. అసలు నకిలీ మధ్య తేడాలు గుర్తించాలని, ఆశపడకుండా.. అప్రమత్తంగా ఉండాలనే సందేశమున్న పేపర్లతో ఆ దిశగా ప్రచారం చేస్తున్నారు.